డెంగ్యూతో చిన్నారి మృతి

రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతురు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారుముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతు రు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్

రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉపముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టా లిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఆశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగోడుతామంటే బీఆర్ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు నన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

• తాగునీటి కోసం గిరిజనుల నిరసన

మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

ఎమ్మెల్యే వేముల మాతృమూర్తికి నివాళి

వేల్పూర్, సెప్టెంబర్ 30: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ సంవత్సరికం సోమవారం నిర్వహించారు. పలువురు నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాంకిషన్‌రావు, దాదన్నగారి విఠల్‌రావు నివాళులర్పించారు.

జిల్లా ఉత్తమ రక్తదాత పురస్కారానికి ఎంపిక

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్తమ రక్తదాతల పురస్కారాల కార్యక్రమానికి ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలును ఎంపికయ్యాడు. వ్యక్తిగతంగా 74 సార్లు రక్తదానం చేయడమే కాకుండా ప్రభుత్వ వైద్యశాలలో వివిధ చికిత్సల నిమిత్తం కావాల్సిన రక్తాన్ని అందించడం కోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం, అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందజేస్తున్నందుకు ఈ పురస్కారాన్ని మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో అందజేయనున్నారు.

అన్ని బస్సులు మండల కేంద్రం మీదుగా వెళ్లాలని వినతి

భిక్కనూరు, సెప్టెంబర్ 30 : అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు భిక్కనూరు మండల కేంద్రం మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పట్టణ యువత సోమవారం భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రతినిధి రవీందర్ మాట్లాడుతూ.. భిక్కనూరు బస్టాండ్ లోపలికి అన్ని డిపోల బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరుగుదొడ్లు, వాటర్, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, యువకులు నిఖిల్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

భిక్కనూరులోని చైతన్య పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, సిబ్బంది

బతుకమ్మలతో ఎల్లారెడ్డి డిగ్రీ కాలేజీ విద్యార్థినులు

ఎల్లారెడ్డి/ కామారెడ్డి రూరల్/ భిక్కనూరు, సెప్టెంబర్ 30: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ ఆట పోటీలను నిర్వహించారు. బీఏ విద్యార్థినులు ప్రథమ, బీకాం విద్యార్థినులు ద్వితీయ, బీఎస్సీ విద్యార్థినులు తృతీయ బహుమతులను గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకాంత్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మన సంప్రదాయానికి చిరునామా అన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ రాణి, గోదావరి, వసంత, లక్ష్మి, సంగీత, కీర్తి, స్వప్న, శంకరయ్య, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 9, 11వ వార్డుల్లో అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. భిక్కనూరులోని చైతన్య పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.

గ్రామాభివృద్ధిలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

పంచాయతీ కార్యాలయ ఆవరణలో వృథాగా రిక్షా

మురుగు కాల్వలు కనిపించకుండా పెరిగిన పిచ్చి మొక్కలు

రోడ్డుకు ఇరువైపులా కనిపించని హరితహారం మొక్కలు

- రోడ్డుకు ఇరువైపులా కనిపించని మొక్కలు
- కంపోస్ట్ షెడ్డులో పెరిగిన పిచ్చిమొక్కలు
- చోద్యం చూస్తున్న అధికారులు

బీబీపేట్, సెప్టెంబర్ 30 : బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి గ్రామాల్లో శ్మశాన వాటిక, కంపోస్ట్ షెడ్డు, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కానీ.. నేడు వాటి ఆలనాపాలనా చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి, పారిశుద్ధ్య పనులు సరిగా చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పంచాయతీ కార్యాలయంలోనే చెత్త తీసుకెళ్లే ఆటోలు, రిక్షాలు మూలన పడ్డాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ కార్యాలయ సమీపంలో మురికి కాల్వల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా తొలగించే నాథుడే కరువయ్యాడు. తుజాల్‌పూర్ నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డులో, తుజాల్‌పూర్ నుంచి రాంపూర్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు కనిపించకుండాపోయాయి. శ్మశాన వాటిక, కంపోస్ట్ షెడ్డులో పిచ్చి మొక్కలు పెరిగినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కంపోస్ట్ షెడ్డు నిరూపయోగంగా మారింది. మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించడంతో అధ్వానంగా ఉండి పూర్తిగా చెత్త పేరుకుపోవడంతో పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోవెంటనే పల్లె ప్రకృతి వనంలోని చెత్తను ఉపాధిహామీ కూలీలతో తీసివేయించారు. పంచాయతీ అధికారులు గ్రామాభివృద్ధిపై మరింత దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

పెద్ద కొడప్‌గల్‌లో మాట్లాడుతున్న చైర్మన్ హన్మంత్ రెడ్డి

మైలారంలో ఆదాయ వ్యయాలు చదివి వినిపిస్తున్న సీఈవో నరేందర్

బిచ్కుంద/పెద్దకొడప్‌గల్/బీబీపేట్, సెప్టెంబర్ 30: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బిచ్కుంద రైతు సేవా సహకార సంఘం 57వ మహాజన సభను సోమవారం సంఘం అధ్యక్షుడు నాల్చర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం జమాఖర్చులను సీఈవో శ్రావణ్ చదివి వినిపించారు. సంఘంలో 1159 మంది రైతులు ఉండ గా.. కేవలం 306మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందని, అన్ని పత్రాలు సమర్పించినా రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ యాదారావు, డైరెక్టర్లు సాయిని శంకర్, చంద్రకాంత్ పటేల్, శంకర్ నాయక్, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ సహకార సంఘం మహాజన సభను చైర్మన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా.. కార్యదర్శి సందీప్ అర్ధ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. బీబీపేట్‌లోని ప్రాథమిక వ్యవయసాయ సహకార సంఘం మహాజన సభను డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సీఈవో నర్సాగౌడ్ 2023–24కు సంబంధించిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. సొసైటీ అభివృద్ధి తదితర అంశాలను చర్చించి తీర్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తరుగు తీసే రైస్‌మిల్స్‌కు ధాన్యం పంపించొద్దు

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 30 : తరుగు తీసే రైస్‌మిల్స్‌కు ధాన్యం పంపించొద్దని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని మైలారం గ్రామ ప్రాథమిక సహకార సంఘంలో సోమవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరేందర్ ఆరు నెలల ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు.

ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూములకు రుణం ఇవ్వాలని తీర్మానం చేశారు. అనంతరం విండో చైర్మన్ హన్మంత్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

బాన్సువాడ, సెప్టెంబర్ 30 : పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో టీఎన్జీవోస్ ఉద్యోగ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. బాన్సువాడ డివిజన్ సంఘం నాయకులు తుల శ్రీనివాస్, కేంద్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, జిల్లా కోశాధికారి దేవరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, ఎల్లారెడ్డి అధ్యక్షుడు మహిపాల్, ప్రధాన కార్యదర్శి శరణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ సభ్యత్వ నమోదులో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగులు

నాటు తుపాకీ స్వాధీనం

అధికారులు స్వాధీనం చేసుకున్న తుపాకీ

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 30: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఒక నాటు తుపాకీని అటవీ శాఖ అధికారులు సోమవారం స్వాధీ నం చేసుకున్నారు. గ్రామస్తుల నుంచి పక్కా సమాచారం అందడంతో గ్రామంలోని ప్రతాప్ సింగ్ ఇంటి వద్ద తనిఖీ చేశారు. అతడి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పోచారం కాలువలో పడి ఒకరి మృతి

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 30: మండలంలోని పోచారం ప్రధానకాలువలో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోరుకుల లక్ష్మణ్(23) శనివారం బంధువు అంత్యక్రియలను ముగించుకొని పోచారం ప్రధాన కాలువ వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం నాగిరెడ్డిపేట ప్రతాప్ థియేటర్ సమీపంలోని పోచారం కాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'నిజాంసాగర్'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, సెప్టెంబర్ 30: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టులోకి సోమవారం 5,800క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని అన్నారు. ప్రాజెక్టు రెండు వరద గేట్ల ద్వారా 11వేల క్యూసెక్కులు, ప్రధాన కాలువలోకి 1,800క్యూసెక్కులు, మొత్తం 12,800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00అడుగుల (17.802 టీఎంసీల)తో నిండుకుండలా ఉన్నదన్నారు.

ఎ